సాక్షి
కాకినాడ

బుధవారం । 8 । మే । 2024

వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు సీలింగ్ ఫ్యాన్‌ను చూపిస్తున్న సీఎం జగన్ →





కోరుకొండ సభకు అశేషంగా తరలివచ్చిన జనంలో ఒక భాగం



జనవాహినికి సీఎం జగన్ అభివాదం →

కోరుకొండలో సింహగర్జన

జన సంక్షేమ యజ్ఞానికి.. రాక్షసుల మాదిరిగా అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ.. నీచమైన కుట్రలకు పాల్పడుతున్న 'పచ్చ' నేతల తుచ్ఛ రాజకీయాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకొండలో 'సింహ'గర్జన చేశారు. మహాప్రవాహంలా తరలివచ్చిన అశేష ప్రజానీకంలో తన వాక్ప్రవాహంతో చైతన్యం నింపారు. మరో ఆరు రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పేదల తలరాతల్ని మార్చేవని చెప్పారు. ఈ కురుక్షేత్ర మహాసంగ్రామంలో.. ఐదేళ్లుగా పసిబిడ్డ నుంచి పండు ముదుసలి వరకూ ప్రతి ఒక్కరి సంక్షేమానికి.. తరతరాలుగా అణగారిపోతున్న ప్రతి వర్గం అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని.. విపక్ష కూటమి ఓటమి చెందేలా.. ప్రజలు ఇచ్చే తీర్పు చంద్రబాబు అండ్ కో నీతిమాలిన రాజకీయాలకు చెంపపెట్టు కావాలని పిలుపునిచ్చారు.

- సీఎం జగన్ సభకు వెల్లువెత్తిన జనం
- అడుగడుగునా బ్రహ్మరథం
- కిక్కిరిసిన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం రోడ్డు
- మండుటెండలోనూ జననేతపై చెక్కుచెదరని అభిమానం
- ఎన్నికలకు 'మేమంతా సిద్ధం' అంటూ నినదించిన 'తూర్పు'
- మిన్నంటిన జై జగన్ నినాదాలు
- సీఎం.. సీఎం.. అంటూ కేరింతలు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని జననేత అభ్యర్థన
- సభ గ్రాండ్ సక్సెస్
- పార్టీ శ్రేణుల్లో జోష్



అదుగో.. జగన్ మామ: మండుటెండలో చిన్నారిని ఎత్తుకుని సీఎం జగన్ సభకు వచ్చిన ఓ తండ్రి



చెట్టెక్కిన అభిమానం: సీఎం జగన్ ప్రసంగాన్ని చెట్టెక్కి మరీ వీక్షిస్తూ, సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న అభిమానులు



అన్నా.. అందుకో నా అభివాదం: ఓ చెల్లెమ్మ ఆనందోత్సాహం



వైఎస్సార్ సీపీ రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాను మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్న సీఎం జగన్



వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతున్న సీఎం జగన్



ప్రజలను ఉత్సాహ పరుస్తూ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: లక్ష్మీనరసింహ స్వామి వెలసిన కోరుకొండలో జగనోత్సాహం పెల్లుబికింది. జన సంక్షేమ, అభివృద్ధి ప్రదాత, ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ చెంతకే వచ్చిన వేళ.. ఆ జననేతకు అశేష ప్రజానీకం అడుగడుగునా బ్రహ్మరథం పట్టింది. జై జగన్.. సీఎం.. సీఎం.. అంటూ పెద్ద పెట్టున నినదించింది. అభిమాన నేతను చూసిన క్షణంలో వారి ఉత్సాహం.. వరద వేళ కట్టలు తెగిన గోదారిలా ఉరకలు వేసింది. దీనికి తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభ వేదికైంది. ఈ సభలో సీఎం జగన్ ప్రసంగాన్ని చెవులారా వినేందుకు.. తమ అభిమాన నేతను కళ్లారా చూసేందుకు.. నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు.. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు, యువత, విద్యార్థులు, చిన్నారులు అనే తేడా లేకుండా వైఎస్సార్ సీపీ జెండాలు చేతబట్టి పెద్ద సంఖ్యలో కోరుకొండ చేరుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే జిల్లాలోని అన్ని దారులూ కోరుకొండ వైపే దారి తీశాయి. ఉదయమే సభా ప్రాంగణానికి చేరుకున్న జనవాహినితో కోరుకొండ లక్ష్మీనరసిహ స్వామి ఆలయం రోడ్డు కిక్కిరిసిపోయింది. రోడ్డు పైనే కాదు.. చెట్లు, చుట్టుపక్కల భవనాలు.. ఇలా ఎక్కడ చూసినా జనమే దర్శనమిచ్చారు. సీఎం వైఎస్ జగన్ సభాస్థలికి చేరుకోగానే వృద్ధులు వైఎస్సార్ సీపీ జెండాలు చేత పట్టుకుని ఒక్కసారిగా ఆనందంతో నృత్యాలు చేశారు. జనం ఈలలు, కేరింతలు, చప్పట్లతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. 'రాజానగరం సిద్ధమా..!' అని సీఎం జగన్ పిలుపునివ్వగానే 'మేమంతా సిద్ధం' అంటూ ముక్తకంఠంతో ప్రతిస్పందించారు.

ఆకట్టుకున్న ప్రసంగం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకొండ సమీపంలోని కాపవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఆయనకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం కోరుకొండ బహిరంగ సభా స్థలికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఆయనతో అశేష జనం.. ప్రవాహంలా కదిలారు. అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. రాజన్న బిడ్డను అక్కున చేర్చుకున్నారు. సభా స్థలికి 11.48 గంటలకు చేరుకున్న అనంతరం సీఎం జగన్ చేసిన ప్రసంగం అమితంగా ఆకట్టుకుంది. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమాన్ని వివరించిన ప్రతిసారీ ప్రజలు ఈలలు, కేకలతో సభను హోరెత్తించారు.

- 'చంద్రబాబును నమ్మి ఓటేస్తే పథకాలన్నింటికీ ముగింపే' అని సీఎం చెప్పినప్పుడు ప్రజలు అవునంటూ ప్రతిస్పందించారు.
- 'చంద్రబాబును నమ్మడమంటే కొండచిలువ నోట్లో తల పెట్టడమే' అనగానే.. ఆయనను నమ్మబోమని చేతులు ఊపుతూ మరీ ప్రజలు సీఎం జగన్‌కు మద్దతు తెలిపారు.
- చంద్రబాబు చేసిన మోసాలను వివరించిన ప్రతిసారీ 'మళ్లీ బాబు పాలన వద్ద'ంటూ జనం పెద్ద పెట్టున స్పందించారు.
- 'గతంలో ఏ ప్రభుత్వమైనా బటన్లు నొక్కి నేరుగా మీ ఖాతాల్లోకి సంక్షేమ ఫలాలు అందించిందా?' అని జగన్ ప్రశ్నించినప్పుడు లేదు లేదంటూ జనం నినదించారు. '59 నెలల మీ బిడ్డ పాలనలో బటన్ నొక్కి నేరుగా మీ ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాను' అని చెప్పగానే 'సీఎం.. సీఎం' అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ కుటుంబ సభ్యుడిగా భావించి అభిమానాన్ని చాటుకున్నారు.
- రాష్ట్రంలో 59 నెలల కాలంలో 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం ప్రకటించినప్పుడు జేజేలు పలికారు.
- మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 99 శాతం అమలు చేసి, అవి అమలయ్యాయా? లేదా? అని తెలుసుకునేందుకు పథకం పొందిన అక్కచెల్లెమ్మల ద్వారా టిక్కు పెట్టిస్తున్నామని చెప్పగానే.. 'ఇచ్చిన మాట నెరవేర్చే సీఎం మీరేనన్నా' అంటూ పలువురు భావోద్వేగానికి గురయ్యారు.
- ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా నా అక్కచెల్లెమ్మలు ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నామని చెప్పగానే ప్రజలు హర్షధ్వానాలు చేశారు.
- నిరుపేదలకు 31 లక్షల ఇళ్ల మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించగానే సొంతింటి కల నెరవేర్చిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని మహిళలు ఉద్వేగానికి గురయ్యారు.
- 'అవ్వాతాతలకు ప్రతి నెలా రూ.3,000 పింఛన్ ఇంటి వద్దకు తెచ్చి ఇవ్వడం ఎప్పుడైనా జరిగిందా..' అని సీఎం అడగగా.. 'లేదు మనవడా' అంటూ వృద్ధులు తమ ఆప్యాయత చూపారు.
- రైతుభరోసా, గ్రామ/వార్డు సచివాలయాలు, ఉచిత పంటల బీమా, మత్స్యకార భరోసా వంటివి అమలు చేస్తున్నట్లు జగన్ చెప్పగానే ఆయా వర్గాల ప్రజలు 'జై జగన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు చేకూరిన లబ్ధిని గుర్తు చేసుకున్నారు.

ఆద్యంతం ఉత్సాహంగా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకొండ పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా, విజయవంతంగా జరిగింది. 'జై జగన్.. జైజై జగన్.. సీఎం.. సీఎం.. హల్లో ఏపీ.. వన్స్ మోర్ వైసీపీ..' అంటూ యువత జెండాలు చేతబట్టి మరీ తమ అభిమానాన్ని చాటుకున్నారు. సభలో సీఎం ప్రసంగిస్తున్నంత సేపూ ఈలలు, నినాదాలు, కేరింతల హోరెత్తించారు. రెండు చేతులు పైకెత్తి సీఎం ప్రసంగానికి మద్దతుగా, చంద్రబాబు మోసాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్లపై ఎక్కడ చూసినా వైఎస్సార్ సీపీ జెండాలు చేతబట్టుకున్న అభిమానులు, కార్యకర్తలే దర్శనమిచ్చారు.

అభ్యర్థుల పరిచయం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను సీఎం జగన్ పరిచయం చేశారు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా జక్కంపూడి రాజాలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, సౌమ్యులు, మంచి చేయాలనే తపన పడుతున్న వారు, మంచి మనసున్న వారిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

చంద్రబాబుపై నిప్పులు

చంద్రబాబు పాలనలో ప్రజలకు చేసిన మోసం, ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేస్తున్న కుట్రలు, వంచనపై సీఎం జగన్ నిప్పులు చెరిగారు. '14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలు గుర్తుంచుకునేలా ఒక్క మంచి పనైనా జరిగిందా?' అని ప్రశ్నించగా.. లేదంటూ ప్రజలు చేతులెత్తి మరీ సమాధానం చెప్పారు. 'రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఆడబిడ్డకు మహాలక్ష్మి పథకం, ఇంటికో ఉద్యోగం అంటూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటైనా అమలు చేశాడా?' అని అడగగా.. 'చంద్రబాబు నమ్మద్రోహి.. బాబును నమ్మం' అంటూ జనం నినాదాలు చేశారు. 'ఫ్యాన్ గుర్తుకు ఓటేసేందుకు మీరంతా సిద్ధమా అని సీఎం జగన్ అడిగినప్పుడు.. 'సిద్ధం.. సిద్ధం' అంటూ ప్రజలు చేసిన నినాదాలతో కోరుకొండ గ్రామం హోరెత్తిపోయింది.



అన్నా.. అపురూపం నీ చిత్రం: సీఎం పర్యటనను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న చెల్లెమ్మ



వెల్‌కమ్ అన్నా: సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు



జననేతపై నిండైన అభిమానంతో..: అశేష జనవాహిని నడుమ సభకు వస్తున్న సీఎం జగన్ కాన్వాయ్



నిండు నూరేళ్లు చల్లగా ఉండు నాయనా: మాతృత్వ వాత్సల్యంతో సీఎం జగన్‌ను ముద్దాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి



కోరుకొండ బస్టాండ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

హమ్మయ్య చల్లబడింది

నెల రోజులుగా భానుడి తీక్షణ వీక్షణాలకు విలవిల్లాడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనం మంగళవారం కురిసిన భారీ వర్షానికి సేద తీరారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురియడంతో వీధులు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే అనుకూల వాతావరణంతో మంచి దిగుబడులు వస్తాయనకున్న రైతుల ఆశలపై ఈ వర్షం నీళ్లు చల్లింది. ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. మెషీన్లతో కోతలు కోసుకొని ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్న రైతులు మినహా మిగిలినవారి ధాన్యపు రాశులు పొలాల్లోనే ఉండి పోయాయి. మండిపోతున్న వేసవి ఎండల్లో ఎన్నికల ప్రచారం చేయడానికి అవస్థలు పడుతున్న అభ్యర్థులు ఒక్కసారిగా వాతావరణం చల్లపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కరప మండలం వాకాడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్

రైతులకు అవస్థలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లాలో తుని, పిఠాపురం తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కాకినాడ, జగ్గంపేట, సామర్లకోట తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలుకు వేడిగాలులు నుంచి ఉపశమనం లభించింది. ఉదయం నుంచి పలు మార్లు వీచిన భారీ గాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జిల్లా కేంద్రమైన కాకినాడలో రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సామర్లకోటలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో భారీ దిగుబడి వస్తుందని కోటి ఆశలతో నూర్పిడులు చేసుకొన్న అన్నదాత ఆశలపై వరుణదేవుడు నీళ్ల చల్లాడు. కాకినాడ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇప్పటి వరకూ 1.38 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో అకాల వర్షాలతో ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. మెషీన్లతో కోతలు కోసుకొని ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్న రైతులు మినహా మిగిలినవారి ధాన్యపు రాశులు పొలాల్లోనే ఉండి పోయాయి. కుప్ప నూర్పిడులు చేసి తేమ శాతం తగ్గిన తర్వాత ధాన్యం అమ్ముకొందామన్న రైతులు ఆయా కళ్లాల్లోనే ధాన్యం నిల్వ చేసుకొన్నారు. ఇలా జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు బరకాలు కప్పుకున్నారు. ప్రస్తుతం కురిసిన చిరుజల్లులకు వరి పంటకు ఎటువంటి నష్టం ఉండదని వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షం కారణంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని, కళ్లాల్లో ఉన్న ధాన్యం వీలైనంత త్వరగా మిల్లులకు తరలించుకోవాలని రైతులకు సూచించారు. పొల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు మెరక ప్రాంతాలకు తరలించుకోవాలని, పనలపై ఉన్న ధాన్యం మొలకెత్తే అవకాశం ఉంటే ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు.



రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు వద్ద నీటిలో నిలిచిపోయిన వాహనాలు

రాజమహేంద్రవరంలో భారీగా..

సాక్షి, రాజమహేంద్రవరం: నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఎర్రటి ఎండ ఉండగా.. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి నగరం అతలాకుతలమైంది. నగరం మొత్తం గోదావరిని తలపించింది. ప్రధాన రహదారుల్లో నీరు పొంగి పొర్లింది. రోడ్డుకు ఇరువైపులా ఉంచిన ద్విచక్ర, కార్లు వర్షపు నీటికి కొట్టుకుని పోయాయి. కంబాల చెరువు, శ్యామల సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, టీ నగర్, సీతంపేట, ఆదెమ్మదెబ్బ, లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సీతంపేటలో వర్షం నీటిలో కారు కొట్టుకుపోయింది. కంబాల చెరువు హైటెక్ బస్ స్టేషన్ వద్ద నీటి ఉధృతి పెరిగింది. ఒక ఆర్టీసీ బస్సుతో పాటు ఆటోలు నీట మునిగాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రయాణికులు హైటెక్ బస్టాండ్ వద్ద వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం తెరపిచ్చిన రెండు గంటల సమయమైనా ముంపు నీరు రోడ్డుపైన అలాగే ఉండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. హైటెక్ బస్ స్టేషన్ వద్ద నిలిచిపోయిన ప్రయాణికులు, విద్యార్థులను అగ్ని మాపక సిబ్బంది తాడు సాయంతో సురక్షిత ప్రాంతానికి చేర్చారు. ఆర్టీసీ బస్సు ముంపు నీటీలో ఇరుక్కుపోవడంతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.



కురిసిన భారీ వర్షానికి రత్నగిరి మెట్ల మీదుగా ప్రవహిస్తున్న నీరు

రత్నగిరిపై కుండపోత

అన్నవరం: సత్యదేవుని భక్తులు, అన్నవరం గ్రామస్తులు మంగళవారం ఉదయం సుమారు గంట సేపు కురిసిన భారీ వర్షాలకు సేద తీరారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉరుములతో కూడిన వర్షం కుండపోతగా కురియడంతో రత్నగిరి మెట్ల దారి నుంచి వర్షం నీరు కిందకు ప్రవహించింది. అది తొలిపాంచా వద్ద స్వామివారి పాదాల మంటపాన్ని ఆనుకుని రోడ్డు మీదకు ప్రవహించింది. ఈ ఏడాదిలో ఇంత భారీ వర్షం కురువడం ఇదే మొదటిసారి. అది కూడా ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలకు ఈ వర్షం వరంలా అనిపించింది. ఈ వర్షం కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోయింది. కాగా, తొలిపాంచా వద్ద గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చైత్ర మాస పూజలు నిర్వహిస్తున్న పండితులు, అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులు ఆలయం దిగువన తమ చెప్పులు విడిచారు. ఈ వర్షం వలన మెట్ల మీద నుంచి ప్రవహించిన జల ప్రవాహానికి ఆ చెప్పులు కొట్టుకుపోయాయి. కాగా, మెట్ల దారి వెంట రాకపోకలు సాగిస్తున్న భక్తులు ఈ వర్షానికి పూర్తిగా తడిసిపోయారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



రామేశ్వరం పీహెచ్‌సీలో బాధితుడికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సూరజ్

సఖినేటిపల్లి: రామేశ్వరం ఏటిగట్టు ఏరియాలో మంగళవారం పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై తేనెటీగలు ఆకస్మికంగా మూకుమ్మడి దాడి చేశాయి. దాడిలో 26 మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరందరినీ స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రిలో వారికి వైద్యులు యనస్, సూరజ్ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్స్ తులసి, ఏఎస్‌ఎంలు తక్షణం వైద్యం అందించారు. ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో నాగప్రసాద్ గాయపడిన కూలీలకు తగిన వైద్యసహకారం అందించడంలో తోడ్పాటునిచ్చారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నలుగురిలో ఒకరైన లంక మోహన్ అను ఉపాధి కూలీని మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు వైద్యులు తెలిపారు. మిగిలిన 25 మంది పీహెచ్‌లోనే అబ్జర్వేషన్‌లో ఉంచామని వైద్యులు చెప్పారు. కాగా తేనెటీగల దాడిలో గాయపడిన వారిని సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ పరామర్శించారు.

పోలీసు అబ్జర్వర్‌కు సమస్యలు తెలపాలి

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని ఎస్పీ సుసరాపు శ్రీధర్ హెచ్చరించారు. ఈ మేరకు ఎస్పీ శ్రీధర్ మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు, జిల్లా పోలీసులకు సూచనలు ఇచ్చేందుకు, పోలీసు విధుల పరిశీలనకు ఎన్నికల సంఘం నుంచి నియమితులైన పోలీసు అబ్జర్వర్ ఐపీఎస్ అధికారి ఎంపీ చంద్రకాంత్‌కు జిల్లాలో ఎవరైనా ఎన్నికలపరంగా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. నేరుగా ఆయన ఫోన్ నంబర్ 78932 56556 కి కాల్ చేయాలని సూచించారు. హింసకు తావు లేకుండా ఎన్నికల సజావు నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కాట్రేనికోన మండలం మగసానితిప్ప, బలుసుతిప్ప, నీలరేవు, మొల్లేటిమొగ, కొత్తపాలెం, బ్రహ్మ సమేధ్యం, ఐ.పోలవరం మండలం గోగుల్లంక తదితర సముద్ర తీర గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్ తనిఖీలు చేసి బందోబస్తు పెంపుపై ఆయా మండల పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

కోనసీమలో పలుచోట్ల అకాల వర్షం

సాక్షి అమలాపురం: కోనసీమ జిల్లాలో కొన్నిరోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటగా కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 29 డిగ్రీల చొప్పున నమోదవుతున్నాయి. వేసవి మొదలైన తరువాత 40 డిగ్రీలు దాటకున్నా కనిష్ట ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో రాత్రి వేళల్లో సైతం జనం ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ సమయంలో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కురిసిన వర్షం జనాన్ని సేద తీరేలా చేసింది. జిల్లాలో మండపేట, కొత్తపేట, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు పరిసర ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రామచంద్రపురం పరిసర ప్రాంతాలలో గాలి దూమారం కలవరపెట్టింది. రైతులు ఆందోళన చెందారు. అమలాపురం, అంబాజీపేట, అల్లవరం మండలాల్లో ఈదురుగాలులకు కొబ్బరి చెట్లు ఊగిపోయాయి. వర్షానికి ఉష్ణోగ్రతలు కొంత వరకు తగ్గాయి. జిల్లాలో మధ్యాహ్నం నుంచి 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు తగ్గింది. ఈదురుగాలులకు పలుచోట్ల వృక్షాలు నేలకులాయి. అమలాపురం రావులపాలెం రోడ్డు మీద చెట్లు విరిగిపడిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పాడ్డాయి.

ఎన్నికల అభ్యర్థులకు ఉపశమనం

సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎండలకు ఠారెత్తిపోతున్నారు. ఆపసోపాలు పడుతూ ప్రచారం రథంపై తిరుగుతున్నారు. అభ్యర్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్నా వేడెక్కిన వాతావరణంలో ప్రచారం చేయడం కష్టంగా ఉంటోంది. దీంతో పలువురు అభ్యర్థులు ప్రచారంలో వడదెబ్బతో అస్వస్థతకు గురవుతున్నారు. వర్షంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారితోపాటు ప్రచారంలో పాల్గొంటున్న కార్యకర్తలు, నాయకులు ఊరట చెందారు.



అలమూరు మండలంలో కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో విరిగిపడిన చెట్లు

రబీ కోతలకు అవాంతరం

వర్షంతో రబీ వరి కోతలకు కొంతవరకు అవాంతరం ఏర్పడింది. జిల్లాలో రబీ కోతలు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. 80 శాతం మెషీన్ కోతలే కావడం విశేషం. ఈ వర్షానికి దిగుబడిపై ప్రభావం పెద్దగా ఉండదు. మెషీన్ కోతకు సైతం పెద్దగా అవాంతరం కాదు. కాని వర్షాలు కొనసాగితే మాత్రం మెషీన్ కోతకు ఇబ్బంది అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం తూర్పు డెల్టాలో వరి కోతలు దాదాపు పూర్తి కావస్తుండగా, మధ్య డెల్టాలో అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్లలో కోతలు జోరందుకున్నాయి. వర్షం ఉద్యాన పంటలకు, కూరగాయ పంటలకు మేలు చేసింది. కొబ్బరి, ఆయిల్‌పామ్, కోకో, పోక, అరటి, కంద, పసుపు వంటి పంటలతోపాటు గోదావరి లంకలు, మధ్యడెల్టాలో పలుచోట్ల కూరగాయ పంటలు పెద్ద ఎత్తున సాగుతున్న విషయం తెలిసిందే. ఆయా పంటలకు, తోటలకు మోటార్ల ద్వారా నీరందిస్తున్నా ఎండలకు వాడిపోతున్నాయి. వర్షం, వాతావరణం చల్లబడడం ఆయా పంటలకు కొంతవరకు మేలు.

పిడుగు పడి మేకల కాపరి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో పిడుగు పడి మేకల కాపరి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బల్లిపాడుకు చెందిన కవల నాగేశ్వరరావు(55) ఎప్పటి లాగే లంక భూముల్లో మేకలు మేపుతూ చెట్టు కింద ఉన్న సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొవ్వూరు పోలీసులు తెలిపారు.

ఓటు వేసిన 12,329 మంది ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చిన ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జిల్లాలో మూడు రోజులుగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 12,329 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న తొలి రోజు జిల్లా స్థాయి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగులతో మాట్లాడారు. జిల్లాలో ఓటు హక్కు ఉండి, ఇక్కడే ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఆయా నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించామన్నారు. పొరుగు జిల్లాలో ఓటుహక్కు కలిగి, కాకినాడ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 4,179 మంది ఉద్యోగులకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వీరి కోసం జిల్లా ఫెసిలిటేషన్ సెంటర్‌లో 13 పోలింగ్ బూత్‌లు, 11 వెరిఫికేషన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌ను సుమారు 70 మంది ఓటర్లకు కేటాయించామని కలెక్టర్ నివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జి.శ్రీనివాసరావు, సీపీఓ పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

యువకుడి పరిస్థితి విషమం

అన్నవరం: విశాఖ జిల్లా గాజువాకకు చెందిన ఒక ప్రేమ జంట స్థానిక లాడ్జిలో ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే లాడ్జి యాజమాన్యానికి విషయం తెలిసి సకాలంలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆ జంటను తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా గాజువాకలోని ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న హర్షవర్ధన్, రాములమ్మ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. హర్షవర్ధన్ కు మరో అమ్మాయితో వివాహం అయింది. రాములమ్మ అవివాహిత. కాగా, వీరు సోమవారం రాత్రి అన్నవరంలోని లాడ్జికి వచ్చి తాము భార్యాభర్తలమని నమ్మించి గదిలో అద్దెకు దిగారు. మంగళవారం ఉదయం సిబ్బంది గదులు శుభ్రం చేస్తుండగా ఆ ప్రేమజంట ఉన్న గది తలుపు తీసి ఉంది. దాంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది గది లోపల చూడగా ఆ జంట మంచంపై అపస్మారక స్థితిలో ఉన్నారు. వారి పక్కన పురుగు మందు సీసా ఉండడంతో వెంటనే 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వీరిని అంబులెన్స్‌లో తుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా వారికి అక్కడ వైద్యులు చికిత్స చేశారు. వీరిలో హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉందని అన్నవరం ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. ఎలాగా వివాహం చేసుకోలేదు, కలిసి చనిపోవాలని భావించి పురుగు మందు తాగినట్లుగా రాములమ్మ తెలిపినట్లు అన్నవరం ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షెల్టర్ శ్లాబు కూలి యువకుడి మృతి

మధురపూడి: ప్రమాదవశాత్తూ శ్లాబు కూలి సీతానగరం మండలం సింగవరం బాదంచెట్టు కాలనీకి చెందిన మోర్త శ్యామ్‌కుమార్ (20) మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం కోరుకొండ మండలం జంబూపట్నంలో చోటు చేసుకుంది. శ్యామ్ అటుగా వెళుతుండగా వర్షం కురియడంతో అంబేడ్కర్ విగ్రహానికి రక్షణగా ఏర్పాటు చేసిన షెల్టర్ శ్లాబు కిందికి వెళ్లాడు. అతనితో పాటు కొందరు జోరుగా కురుస్తున్న వర్షానికి ఈ షెల్టర్ కిందికి వెళ్లారు. విపరీతంగా కురిసిన వర్షం కారణంగా శ్లాబు కూలింది. శ్యామ్‌కుమార్ తలకు బలమైన గాయమై మెదడు బయటకు వచ్చి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ముంగమూరి పృథ్వీకి గాయాలయ్యాయి. ప్రస్తుతం అతను హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.కోరుకొండ పోలీసులు మృతి కేసు నమోదు చేస్తున్నట్టు సీఐ నాగమురళి తెలిపారు.

తల్లి రోదన

నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయావా అంటూ కొడుకు శ్యామ్ మృతితో తల్లి నాగమణి గుండెలవిసేలా రోదించారు. శ్యామ్ మృతితో సింగవరం బాదంచెట్టు కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. శ్యామ్‌కుమార్, తల్లి నాగమణి సింగవరంలో ఉంటున్నారు. తండ్రి విక్టర్ బాబు హైదరాబాద్‌లోని ఓ స్వచ్ఛంద సేవాసంస్థలో రోజుకూలీగా పనిచేస్తున్నారు.



మృతుడు శ్యామ్‌కుమార్

జగన్‌తోనే సంక్షేమం

- చంద్రబాబు హామీలు బోగస్
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కన్నబాబు, సునీల్‌ను గెలిపించండి
- శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్



సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌ను గెలిపించాలని కోరుతున్న ఎంపీ బోస్

కాకినాడ రూరల్: ఈ ఎన్నికలు చాలా కీలమైనవి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. మీరంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలి. జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమవుతుంది. చంద్రబాబు బోగస్ హామీలు నమ్మవద్దని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌బోస్ పిలుపునిచ్చారు. సర్పవరం జంక్షన్ వద్ద కాకినాడ రూరల్ నియోజకవర్గ శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం జెడ్పీటీసీ సభ్యుడు, శెట్టిబలిజ నేత నురుకుర్తి రామకృష్ణ అధ్యక్షత మంగళవారం జరిగింది. సమావేశానికి నియోజకవర్గంలోని శెట్టిబలిజలు భారీగా తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ హాజరయ్యారు. బోస్ మాట్లాడుతూ చైతన్యవంతులైన శెట్టిబలిజలు తమ ఓటు వినియోగించుకునే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, కన్నబాబు మంచి మనుషులని, పిలిస్తే పలికే వారికి ఓటు వేసి గెలిపించాలని పిలుపు ఇచ్చారు. ఉన్నత విద్యావంతులైన ఈ ఇద్దరు అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల కంటే మెరుగైనవారన్నారు. చంద్రబాబునాయుడు ఆచరణ సాధ్యం కాని హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నందున నమ్మవద్దన్నారు. చంద్రబాబు హామీలకు ఏటా రూ.లక్షా 60వేల కోట్లు అవుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోపై ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. చేయగలిగిన హామీలనే ఆయన ఇచ్చారన్నారు. టీడీపీకి 40 ఏళ్లుగా వెన్నెముకగా ఉన్న బీసీలు ఇప్పుడు ఆ పార్టీకి దూరమయ్యారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు కింద రూ.రెండు లక్షల 60 వేల కోట్లు వెచ్చించారన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిన నేత జగన్ : కన్నబాబు

రాష్ట్రంలో నా బీసీలు, నా ఎస్సీలు, నా మైనార్టీలు అని చెప్పుకునే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నందుకు తామంతా గర్వంగా ఫీలవుతున్నామని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ శెట్టిబలిజ కులస్తులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. జగన్ కేబినెట్‌లో బీసీలకు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పదవిని శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు ఇచ్చారని గుర్తు చేశారు. బీసీలకు రెండు రాజ్యసభ సీట్లు ఇస్తే అందులో ఒకటి బోస్‌కు ఇచ్చారని, ఎమ్మెల్సీలు రెండు ఇస్తే అందులో ఒకటి పాత పశ్చిమ గోదావరి జిల్లాకు, మరొకటి పాత తూర్పు గోదావరి జిల్లాకు ఇచ్చారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జిల్లా పరిషత్ స్థానం శెట్టిబలిజకు ఇచ్చారని, ఈ ఎన్నికల్లో రాజమహేంద్రవరం, నరసాపురం ఎంపీ సీట్లు శెట్టిబలిజకు ఇచ్చారన్నారు. ఈ ప్రాంతంలో బలమైన సామాజికవర్గం శెట్టిబలిజ అన్నారు. వైఎస్సార్ సీపీ ఒక కులానికి సంబంధించిన పార్టీ కాదని, అందరి పార్టీ అన్నారు. జనసేనలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం లేదన్నారు.

కాకినాడ రాత మారుస్తా : ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

కాకినాడ ఎంపీగా తనను గెలిపించండి కాకినాడ రాత మారుస్తానని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కోరారు. మీ పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇస్తానన్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 400గ్రామాలను దత్తత తీసుకుని ఒక్కో గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేస్తానన్నారు. తీర ప్రాంతం, ఎస్ఈజెడ్, పోర్టులు, ఎయిర్ పోర్టు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండడంతో రూ.30వేల కోట్లతో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులకు ఏటా 5వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న, మధ్య తరగతి నిరుద్యోగులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇంక్యుబేషన్ సెంటర్‌ను రూ.100 కోట్లతో ఏర్పాటు చేస్తామన్నారు. తనతో పాటు కన్నబాబును గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌తో సామాజిక న్యాయం సాధ్యవుతుందని, ఆయన కొనసాగాలన్నా, మంచి జరగాలన్నా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, దూనబోయిన అరుణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, పార్లమెంట్ పరిశీలకులు, మాజీ మేయర్ సరోజ, యనమదల రవి, రాజమహేంద్రవరానికి చెందిన శ్రీను, కడియాల చిన్నా, గంజా సత్తిబాబు, పాలిక నరసింహమూర్తి పాల్గొన్నారు.